క్లుప్తంగా

ముమ్మరంగా సాగు పనులు



వరినాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు

దెందులూరు: మండలంలో రైతులు ముమ్మరంగా సాగు పనులు చేస్తున్నారు. 17 గ్రామ శివారు ప్రాంతాల్లో 14,500 ఎకరాల ఆయకట్టు ప్రస్తుత సీజన్‌లో సాగులో ఉంది. సాగు నీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా అధికారులు ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో దుక్కి దున్ని విత్తనాలు నాటడం, వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీబిజీగా ఉన్నారు. ట్లు పనుల్లో రైతన్న బిజీబిజీగా ఉన్నారు. శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ అధికారులు ఇప్పటికే పొలంబడి పేరిట సమావేశాలు నిర్వహించి రైతులకు సూచనలు సలహాలు ఇచ్చారు.

రాట్నాలమ్మకు ఆషాఢం సారె



విశేష అలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి : మండలంలోని రాట్నాలమ్మ అమ్మవారికి రాయన్నపాలెం పరిసర ప్రాంత మహిళలు ఆషాడం సారెను సమర్పించారు. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వెలసిన రాట్నాలమ్మ అమ్మవారికి శుక్రవారం సుమారు 100మంది మహిళలు వివిధ రకాల పిండి వంటకాలు, చీరలను తీసుకుని పెద్ద సంఖ్యలో ఊరేగింపుగా అమ్మవారి దేవస్థానానికి విచ్చేసి, సారెను సమర్పించారు. ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: మండలంలోని భీమడోలు సెక్షన్ పరిధిలోని సూరప్పగూడెం సబ్‌స్టేషన్ ఏరియా కొత్త బ్రేకర మార్పు చేస్తున్నందున సంబంధించిన ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఈనెల 19వ తేదీ శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శివాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుండుగొలను, భీమడోలు, నాగహనుమాన్, సూరప్పగూడెం, పోలసానిపల్లి ఆక్వా కల్చర్, పరిశ్రమల ఫీడర్ల పరిధిలోని భీమడోలు, ఆర్జావారిగూడెం, సూరప్పగూడెం, పోలసానిపల్లి, పాతూరు, దిగిలు పాటిదిబ్బ గ్రామాల్లోని విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

డీఈ బాధ్యతల స్వీకరణ



రాళ్లపల్లి భీమేశ్వరరావు

ఉంగుటూరు: మండలంలో ఉంగుటూరు విద్యుత్ శాఖ డీఈగా రాళ్లపల్లి భీమేశ్వర రావు బాధ్యతలు చేట్టారు. గురువారం ఉంగుటూరు విద్యుత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆపోస్టులో పనిచేసిన ఎస్ శ్రీనివాసరావు అమలాపురం డిఈగా బదిలీపై వెళ్లారు. ఏఇలు, ఇతర విద్యుత్ సిబ్బంది భీమేశ్వరరావును కలిసి అభినందనలు తెలిపారు.

గుండుగొలను సొసైటీలో స్థలదాత ఫొటో ఉంచాలి

భీమడోలు: గుండుగొలను విశాల పరపతి సహకార సంఘం కార్యాలయంలో తొలగించిన స్థలదాత, దివంగత మాజీ సొసైటీ అధ్యక్షుడు వగ్వాల వెంకట రెడ్డియ్య ఫొటోను యథావిధిగా కార్యాలయంలో ఉంచాలని ఏలూరు జిల్లా విభాగ సహకార అధికారిణి కె.సత్యవతి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల కాపీలను విలేకరులకు శుక్రవారం మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్, మాజీ సొసైటీ సభ్యుడు ఎస్.శ్రీనివాసరావులు అందజేసారు. గుండుగొలనులో సొసైటీ నిర్మాణానికి స్థలాన్ని అందించిన వగ్వాల రెడ్డియ్య ఫొటోను కార్యాలయంలో దశాబ్దాలుగా ఉంటుంది. అయితే మే నెలలో అఫీసియల్ పర్సన్ ఇంచార్జి పవన్ చక్రవర్తి, ఇంచార్జి కార్యదర్శి ఎన్వీ మోహనరావులు ఏకపక్షంగా నిబంధనలకు విరుద్ధంగా ఆ ఫోటోను తొలగించారు. దీనితో మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్, సంఘం మాజీ సభ్యులు ఎస్.శ్రీనివాసరావులు ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకుని వెళ్లారు. ఇందులకు బాధ్యులైన వారిపై తగు చర్యలు తీసుకోవాలని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. జిల్లా సహకార శాఖ అధికారులు విచారించి ఆ ఫొటోను యథావిధిగా ఉంచాలని ఆదేశిస్తూ ప్రస్తుత పర్సన్ ఇంచార్జి వారికి ఉత్తర్వులు అందించారని, భవిష్యత్తులో ఈ సమస్య పునరావృత్తం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని వారు తెలిపారు.

పప్పన్నం కరువాయె..!

- రేషన్ డిపోల్లో దొరకని కందిపప్పు
- ఆరునెలలుగా పంపిణీ చేయని కూటమి ప్రభుత్వం
- ప్రతి నెలా లబ్ధిదారుల ఎదురుచూపులు
- ఆపై తీవ్ర నిరాశ



రేషన్ కోసం రేషన్ డిపో వద్ద బారులు తీరిన లబ్ధిదారులు



పేదలకు అందని కందిపప్పు

దెందులూరు: బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనలేని పేద, మధ్య తరగతి ప్రజలు కూటమి ప్రభుత్వం పేదోడికి పప్పన్నం కరువైంది. తాము అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని సంబరాలు చేసుకుంటున్న కూటమి నేతలు పేదలకు కిలో కందిపప్పు కూడా రేషన్‌షాపుల ద్వారా అందించలేకపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఇంటి వద్దకే రేషన్ రద్దు చేసిన సర్కారు నిర్ణయంతో రేషన్‌షాపుల వద్ద జనం క్యూలు కట్టి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రేషన్ డిపోల్లో అన్ని నిత్యావసర సరుకులు తక్కువ ధరలకు దొరికేలా మాల్స్‌లా తీర్చుదిద్దుతామని ఎన్నికల ముందు ప్రచారం చేసిన కూటమి నాయకులు పేద, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన కందిపప్పు సరఫరా చేయలేకపోతున్న పరిస్థితి ఒక వైపు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయి. కూరగాయల ధరలు అమాంతంగా పెరిగాయి. గత ప్రభుత్వంలో బియ్యం, పంచదార, కందిపప్పు, గోధుమ పిండి, రాగుల పిండి పంపిణీ చేశావారని, కిలోరూ.67లకే కందిపుప్పు ఇచ్చేవారని జనం గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం రేషన్ డిపోల ద్వారా కందిపప్పు ఎప్పటి నుంచి ఇస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

ఏడాదిగా ఎదురుచూపులే

నియోజకవర్గంలో దాదాపు 72వేల మందికి తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. సుమారు రెండున్నర లక్షల జనాభా ప్రతినెల రేషన్ డిపోలో ఇచ్చే కందిపప్పు కోసం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. ప్రతి నెల కార్డుదారులు కందిపప్పు వచ్చిందా...ఎప్పుడొస్తుంది..అసలు ఇస్తారా లేదా అని ప్రశ్నలు అడుగుతుంటే ఏమీ సమాధానం చెప్పాలో తెలియక రేషన్ డీలర్లు తెల్లమొహ వేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.140 నుంచి రూ.150లు ధర పలుకుతోంది. అంత ధర పెట్టి కొనలేని పేద, మధ్య తరగతి ప్రజలు రేషన్ షాపులో ఎప్పుడు ఇస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈనెల కాకపోతే వచ్చే నెల ఇస్తారని ఆశపడుతూ వస్తున్న మహిళలకు ఏడాదిగా ఎదురుచూపులే మిగిలాయి.

అడిగితే కసురుతున్నారు

ఎన్నికల ముందు అన్ని సరుకులు రేషన్‌షాపుల్లో దొరికేలా చూస్తామన్నారు. ఇప్పుడేమో కందిపప్పు రాలేందంటున్నారు. ప్రతి నెల కందిపప్పు కోసం ఎదురు చూస్తున్నాం. డీలర్ మాత్రం రాలేదు, వస్తే ఇవ్వమా అని కసురుకుంటున్నారు. గతంలో ఇంటింటికీ రేషన్ బండి ద్వారా బియ్యం, పంచధార, కందిపప్పు, గోధుమ, రాగిపిండి ఇచ్చేవారు. ఏడాదిగా బియ్యం పంచధార మాత్రమే ఇస్తున్నారు.

ఇంకెన్నాళ్లకు ఇస్తారు ?



కూటమి ప్రభుత్వం కందిపప్పు కచ్చితంగా ఎప్పుడు ఇస్తారు బహిరంగ ప్రకటన చేయాలి. నాయకులు చెప్పే మాటలకు క్షేత్రస్థాయిలో పాలనకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. ఆరు నెలలుగా కందిపప్పు ఇవ్వకపోయినా కూటమి నాయకులు ప్రజాప్రతినిధులు మాట్లాడటం లేదు.వెంటనే కందిపప్పును సరఫరా చేయాలి

– లక్ష్మి దుర్గ, సర్పంచ్

అడిగితే కసురుతున్నారు



ఎన్నికల ముందు అన్ని సరుకులు రేషన్ షాపుల్లో దొరికేలా చూస్తామన్నారు. ఇప్పుడెమో కందిపప్పు రాలేందంటున్నారు. ప్రతి నెలా కందిపప్పు కోసం ఎదురు చూస్తున్నాం . డీలర్ మాత్రం రాలేదు.వస్తే ఇవ్వమా అని కసురుకుంటున్నారు.

– పీ. సునీత, సర్పంచ్, పాలగూడెం

కందిపప్పు బదులు నగదు ఇవ్వాలి



గత ఆరు నెలలుగా కూటమి ప్రభుత్వం ఇవ్వని కందిపప్పుకు బదులుగా నగదును లబ్ధిదారులకు వెంటనే ఇవ్వాలి. పేద మధ్యతరగతి ప్రజలకు అత్యవసరమైన కందిపప్పు విషయంలో కూడా అలసత్వం సరైంది కాదు.

– పర్వతనేని శ్రావణి, సర్పంచ్, రామారావు గూడెం

కందిపప్పు లేదంటున్నారు



రేషన్ డిపోల్లో బియ్యం, పంచధార మాత్రమే ఇస్తున్నారు. కందిపప్పు అడిగితే రాలేదని డీలర్ చెబుతున్నాడు. బయట మార్కెట్‌లో కిలో రూ.150లు వరకు పలుకుతోంది. అంతధర పెట్టి కొనలేకపోతున్నాం.పాలకులు ఆలోచించి కందిపప్పు సరఫరా చేయాలి.

– అమల, సర్పంచ్ కోక్కిరాయలంక

20న డివిజనల్ కమాండర్ దెందులూరు రాక

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ మేజర్ యేసు రాజ్యం లతమ్మలు దెందులూరు సాల్వేషన్ ఆర్మీ నూతన మిలీనియం చర్చికి విచ్చేస్తారని దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య తెలిపారు. శుక్రవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ దెందులూరు గౌడ వీధిలో నూతనంగా నిర్వహించిన సాల్వేషన్ ఆర్మీ మిలీనియం చర్చికి ఇటీవల ఏలూరు జిల్లాకు నూతన సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించిన యేసు రాజ్యం,లతమ్మలు తొలిసారిగా దెందులూరు విచ్చేస్తురన్నారు. సాల్వేషన్ ఆర్మీ సంఘస్తులు పెద్దలు గృహ సమితి సభ్యులు సండే స్కూల్ చిన్నారులు గ్రామస్తులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



రామచంద్రపురంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెదవేగి : ప్రతి విద్యార్థి అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని రామచంద్రపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా.గుగులోతు కృష్ణ అన్నారు. పెదవేగి మండలం రామచంద్రపురం ఉన్నత పాఠశాల్లో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి ఆ మొక్కను సంరక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె శిరోమణి, కె లీల సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



హ్యాండ్‌బాల్ వర్క్‌షాపులో పాల్గొన్న ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థులు

దెందులూరు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని పలువురు వక్తలు తెలిపారు. శుక్రవారం వ్యాయామ విద్యా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. నతానియేలు అధ్యక్షతన జరిగిన లేటెస్ట్ ట్రెండ్స్ వర్క్ షాప్ జరిగింది. ఆటల్లో మెలుకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఐడీ కాలేజీ ప్రిన్సిపల్ గిరిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు డాక్టర్ బి కృష్ణ దీపిక, అసిస్టెంట్ ప్రొఫెసర్ వెటర్నరీ కాలేజ్ గన్నవరం సౌజన్య, వైస్ ప్రిన్సిపల్ డా. వై పోల్ రెడ్డి, వర్క్ షాప్ కన్వీనర్ డా.దిలీప్ కుమార్, అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించుకోవాలి



జగన్నాథపురం పాఠశాల్లో యుటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

పెదవేగి : ఉపాధ్యాయులంతా ఏకతాటిపై నిలబడి తమ హక్కులను పరిరక్షించే విధంగా కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిఆర్ రవికుమార్ అన్నారు. శుక్రవారం పెదవేగి మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ నిర్వహించి సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా పెదవేగి మండలం జగన్నాథపురంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతున్న ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో యూటీఎఫ నిరంతరం పోరాడుతుందన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పెదవేగి మండల శాఖ ద్వారా ఈ విద్యా సంవత్సరం ట్రాన్స్ఫర్‌లో నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అలీ, జిల్లా ప్రదాన కార్యదర్శి రవికుమార్, పెదవేగి మండల అధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, కోశాధికారి లక్ష్మీనారాయణ, బి వెంకటేశ్వరరావు, షేక్ బాజి, నాగార్జున, నాగరాజు, రాజేంద్ర, మోహన్‌రావు, లక్ష్మణరావు, తినాథ్, నరేంద్ర, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



దెందులూరు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

దెందులూరు: అన్ని శాఖల అధికారులు ఉద్యోగులు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని దెందులూరు ఎంపీడీవో కే శ్రీదేవి అన్నారు. శుక్రవారం దెందులూరు ఎంపీపీ బొమ్మనుబోయిన సుమలత అధ్యక్షతన దెందులూరు మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వర్మ, పీఆర్ఏఈ చౌదరి, ఎంఈఓ ప్రసాద్, ఉపాధి ఏపీఓ ఫాతిమా, వెలుగు ఏపీఎం సురేష్, మత్స్య శాఖ ఇన్‌స్పెక్టర్ సతీష్, గృహ నిర్మాణ శాఖ ఏఈ వివేకానంద, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు, పశు వైద్య శాఖ అధికారి హరికృష్ణ, వైద్య శాఖ డాక్టర్ ప్రవీణ్, స్త్రీ శిశు శిక్షణ శాఖ దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్లు చిట్టెమ్మ, శ్రీదేవి,శాఖా పరమైన ప్రగతిని వివరించారు. సమావేశంలో ఎంపీటీసీలు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా మహా యజ్ఞానికి తరలిరండి

దెందులూరు: ఈనెల 19న హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో హనుమాన్ చాలీసా మహా యజ్ఞంకు భక్తులంతా తరలిరావాలని బ్రాహ్మణ సేవా సంఘం ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు పెనుమాక వాసుదేవరావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం మాదేపల్లిలో ఆయన మాట్లాడారు. 1108 గొంతుకలతో హనుమాన్ చాలీసా మహా యజ్ఞంలో పాల్గొవాలని కోరారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన



చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: రైతులు చిరు ధాన్యాల సాగు వైపుగా వెళ్లాలని, మార్కెట్ కూడా ఆశా జనకంగానే ఉందని ఏరువాక ఏలూరు జిల్లా సీనియర్ శాస్త్రవేత్త కె.ఫణికుమార్, ఎక్స్‌టెన్షన్ శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబులు అన్నారు. పోలవరం మండలం వింజరం పంచాయతీలో చిరుధాన్యాలు సాగు ప్రాముఖ్యతపై ఏర్పాటుచేసిన సదస్సులో వారు మాట్లాడారు. సిరి (చిరు) ధాన్యాలు సాగు చేస్తే విత్తనాలు, పురుగు మందులు, ఎరువులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. మినుములు బీపీఎన్–8, పీయూ–31, టీబీజీ–104 రకాల లక్షణాలు, దిగుబడులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న పంటపై ముఖ్యంగా కత్తెర పురుగు నివారణకు పురుగు మందులు, బయోలాజికల్ కంట్రోల్ పద్ధతులను పాటించాలన్నారు. జాతీయ ఆహార భద్రత, పోషక మిషన్ పథకంలో భాగంగా 50 శాతం రాయితీపై వచ్చిన మినుములు విత్తనాలను సర్పంచ్ చేతుల మీదగా రైతులకు అందజేశారు. వింజరం సర్పంచ్, మండల వ్యవసాయ అధికారి పోలవరం, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకు నాబార్డ్ కృషి



భీమడోలులో నాబార్డ్ హాట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమడోలు: గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు నాబార్డ్ అగ్రగామిగా నిలిచిందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు సంతమార్కెట్ వద్ద గ్రామీణ హాట్ కార్యక్రమంలో నాబార్డ్ నిధులు రూ.15లక్షలతో చైతన్య యువజన సంఘం సహకారంతో నిర్మించిన షెడ్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ పాము సునీతామన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ గ్రామీణ హాట్ ద్వారా ప్రజలకు, వ్యాపారులకు మేలు జరుగుతుందన్నారు. నాబార్డు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాబార్డ్ డీడీఎం అనిల్ కాంత్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే నాబార్డ్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనుమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, పెద్దలు ప్రత్తి మదన్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు నిమ్మకాయల గణ, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసిల్దార్ బి.రమాదేవి, గ్రామకార్యదర్శి కేపీ తనూజ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

చింతలపూడి : వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉం,డి సమస్యలు పరిష్కరించాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా ఆదేశించారు. చింతలపూడి సబ్ డివిజన్లో వ్యవసాయశాఖ సిబ్బందికి స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు కౌలు కార్డులు ఇవ్వాలని, రుణాలు ఇప్పించాలని క్రాఫ్ ఇన్సూరెన్స్ కట్టించాలని సూచించారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించబోతున్న సందర్భంగా రైతుల గ్రీవెన్స్‌ను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం స్టేట్ బ్యాంక్ మేనేజర్‌ను కలిసి రైతులకు రుణాలు మంజూరు చేయాలని, ఇన్సూరెన్స్ త్వరగా కట్టించాలని కోరారు. కార్యక్రమంలో నాలుగు మండలాల మండల వ్యవసాయ అధికారులు మురళి, ప్రదీప్, ముత్యాలరావు, ప్రియాంక, టెక్నికల్ ఏఓ ప్రసూన,. సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అడుగుకో గొయ్యి.. గజానికో గుంత



భీమడోలు జంక్షన్ రోడ్డులో ఏర్పడిన భారీ గుంతలు



పోలసానిపల్లి గురుకుల కళాశాల శివారు రోడ్డు పాడైన దృశ్యం

- ఛిద్రమైన రోడ్లు
- రాకపోకలకు అవస్థలు

భీమడోలు: మండలంలోని పలు రహదారులు గోతుల మయంగా మారాయి. ఆ రోడ్లపై రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. అడుగుకో గొయ్యి..గజానికో గుంత ఉండడంతో రాకపోకలను నరకం చేస్తున్నారు. గోతుల వల్ల ఒళ్లు హూనం కావడంతో పాటు వాహనాలు దెబ్బతింటున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. కనీసం ప్యాచ్ వర్క్‌లైనా చేయాలని కోరుతున్నారు. జాతీయ, రాష్ట్రీయ రహదారులను కలుపుతూ ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వెళ్లే భీమడోలు, ద్వారకాతిరుమల రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. దీంతో ఆలయానికి వెళ్లే భక్తులు అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నాలుగు నెలల కితమే భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్ వరకు లక్షలాది రూపాయలతో గుంతలు పూడ్చిన రోడ్డు.. తొలకరిలో కురిసిన చిన్నపాటి వర్షాలకు ఛిద్రమై అడుగుక గొయ్యి..గజానికో గుంత అన్న చందంగా మారింది. పనుల్లో నాణ్యత కొరవడంతో కంకర లేచి గోతులతో నిండింది. రహదారిపై ప్రయాణం భయానకరంగా మారడంతో ద్విచక్రవాహనదారులు రాకపోకలు సాగించాలంటేనే భయపడుతున్నారు. అదే విధంగా పోలసానిపల్లి గురుకుల కళాశాల శివారు రాష్ట్రీయ రహదారిపై రోడ్డు అధ్వాన్నంగా మారింది. దీంతో ద్వారకాతిరుమల వెళ్లే రోడ్డు భక్తుల పాలిట శాపంగా మారింది. వర్షాకాలం కావడంతో నీటితో నిండిన గోతులను అంచనా వేయలేక ద్విచక్రవాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్నారు. భీమడోలు జంక్షన్ నుంచి పోలసానిపల్లి శివారు వరకు ఐదు కిలోమీటర్ల దూరంలో గోతులతో నిండాయి. నేషనల్ హైవే ఆధారిటి అధికారులు గోతులను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు. భీమడోలు ఆర్అండ్‌బీ ఏఈ జే.భాస్కర రావు వివరణ కోరగా రోడ్డుపై గోతులు ఏర్పడానికి డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడమే నన్నారు. నిధులు మంజూరు కాగానే గోతులు పూడ్చేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు.



పోలసానిపల్లి బ్రిడ్జి వద్ద భారీ గొయ్యి ఏర్పడిన దృశ్యం



భీమడోలు జంక్షన్ నుంచి సంతమార్కెట్ వద్ద కంకర లేచిన దృశ్యం